# నగదు, బంగారం సీజ్ చేసినపుడు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్**

**ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనల ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి...**

**దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం..**



వరంగల్ క్రైం బ్యూరో, అక్టోబర్ 21 (వాయిస్ టుడే ప్రతినిధి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే తనిఖీల్లో పట్టుబడే నగదు, బంగారం సీజ్ చేసేటప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి ఆయన రాష్ట్ర డీజీపీ అంజని కుమార్, ఇతర రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు, ఎం.సి.ఎం.సి., నగదు, బంగారం పట్టివేత, సి విజల్ యాప్, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

వరంగల్ జిల్లా నుండి కలెక్టర్ పి.ప్రావీణ్య, ఆర్వో లు షేక్ రిజవాన్ బాషా, వాఖేడే, కృష్ణ వేణి, డిసిపి రవీందర్, సంబంధిత ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పెండింగులో ఉండకుండా వేగవంతంగా పరిష్కరించాలని, రాజకీయ పార్టీల, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం అందించాలని సూచించారు. ఎన్నికల ప్రచారం సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల, అభ్యర్థుల నుంచి సువిధ యాప్ ద్వారా, ఆఫ్ లైన్ లో వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని, క్షేత్రస్థాయిలో జరిగే ఎన్నికల ప్రచారంలో వినియోగించే ఆడియో, వీడియోలను పరిశీలించి ఎం.సి.ఎం.సి. ధృవీకరించాలని, ప్రతి రోజూ ఎం.సి.ఎం.సి., సువిధ యాప్, ఆఫ్ లైన్ దరఖాస్తులపై ఎన్నికల అధికారి దృష్టి సారించాలని అన్నారు.

ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో సంబంధిత వ్యక్తులకు సీజ్ చేస్తున్న నగదు, బంగారం వివరాలు, ఎక్కడ అప్పీల్ చేయాల్సి ఉంటుంది అనే అంశాలను తెలియజేస్తూ రశీదు తప్పనిసరిగా అందించాలని అన్నారు. సీజ్ చేసిన బంగారం, నగదు 10 లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్ కు అప్పగించాలని, 10 లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలని అన్నారు. సదరు నగదుపై వచ్చే అపీల్ లను సంబంధిత గ్రీవెన్స్ సెల్, ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనలు, ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారని అన్నారు.

ఎన్నికల సమయంలో సీజ్ చేసే నగదు, బంగారం, మధ్యం, ఇతర విలువైన అభరణాల గురించి మీడియాకు సమాచారం అందించాలని, అదే విధంగా సంబంధిత వ్యక్తులు చేసిన అప్పీల్ అనంతరం విడుదల చేసే నగదు వివరాలు సైతం మీడియా కు అందించాలని, దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక నిర్ణీత నమూనాలో సమర్పించాలని అన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలెన్సు బృందాలు, వీడియో సర్వేలెన్సు బృందాలతో పాటు తప్పనిసరిగా వీడియో కెమెరా సౌకర్యం ఉండాలని, ప్రతి తనిఖీ వీడియో కెమేరాలో రికార్డు చేయాలని అన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వల్నరబుల్ పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. వల్ నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అందించే ఫిర్యాదులను సైతం దృష్టిలో ఉంచుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ఓటర్ స్లిప్పులు త్వరగా ముద్రించి పంపిణీ చేసే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలనీ, సామాజిక మాధ్యమాలలో ఎన్నికల నిర్వహణపై వస్తున్న వదంతులు, అపోహలను నివృత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై అధిక దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.



## ఈవీఎం గోడౌన్‌ను, స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించిన కలెక్టర్,ఎస్పీ

వాయిస్ టుడే ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 21 : శనివారం రోజున సిరిసిల్ల,వేములవాడ పట్టణాల్లో జూనియర్ కాలేజీలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లు, సర్దాపూర్ వద్ద గల ఈవిఏం గౌడన్ లను అధికారులతో కలిసి పరిశీలించి తగు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ .జిల్లా కేంద్రంలోని సర్ధపూర్ లో గల ఈవీఎం గోడౌన్ లు, సిరిసిల్ల , వేములవాడ పట్టణాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ లను కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ లు శనివారం రోజున అధికారులతో కలిసి సందర్శించారు. ప్రస్తుత సాధారణ ఎన్నికలలో వినియోగించాల్సి ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.స్ట్రాంగ్ రూమ్ ల వద్ద పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ ఖీమ్య నాయక్, డిఎస్పీ నాగేంద్రచారి, రవికుమార్, సి.ఐ లు ఎస్.ఐ లు అధికారులు ఉన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

**వెస్ట్ జోన్ డిసిపి సీతారాం**



జనగామ జిల్లా, రఘునాథపల్లి,అక్టోబర్ 21, (వాయిస్ టాడే): శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం మన అందరి బాధ్యత అని వెస్ట్ జోన్ డిసిపి సీతారాం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అమరులకు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన సంస్కరణ సభలో ఆయన మాట్లాడుతూ... ప్రజా రక్షణ ధ్యేయంగా పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ధన ప్రాణాలను కాపాడుటలో ముందు వరుసలో పోలీసు శాఖ నిలుస్తుందని ఆయన అన్నారు. పోలీసు ఉద్యోగం అనేది ఛాన్స్ కాదని ఛాయిస్ అని అదే సంకల్పంతో ఉద్యోగ ధర్మాన్ని పాటించాలని అన్నారు. రానున్న ఎన్నికల క్రమంలో పోలీసులు అందరూ కలిసికట్టుగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చుడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ఘన్పూర్ ఏసిపి శ్రీనివాసరావు, జనగామ ఏసిపి దేవేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఏసిపి రఘు చందర్, రఘునాథపల్లి రూరల్ సీఐ శ్రీనివాస్ రెడ్డి తో పాటు వివిధ మండలాల సిఐలు సాయి, రాజు, రమణ, ఎస్ ఐ లు రఘుపతి, వినయ్ కుమార్, హరికృష్ణ, సతీష్,నాగరాజు, శ్వేత, శ్రీకాంత్ గౌడ్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేపిఆర్ జనసేన ట్రస్ట్ ఆధ్వర్యంలో 150 కోట్లతో కామారెడ్డి నియోజకవర్గ మేనిఫెస్టోను విడుదల చేసిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి బ్యూరో అక్టోబర్21 (వాయిస్ టుడె) కేపిఆర్ జనసేన ట్రస్ట్ ఆధ్వర్యంలో 150 కోట్లతో ఉచిత విద్యా, వైద్యము, రైతులకు భరోసా, మహిళలకు, నిరుద్యోగులకు పెద్దపీట, కామారెడ్డి నియోజకవర్గ మేనిఫెస్టోను విడుదల చేసిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి. కామారెడ్డి నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ప్రజల కొరకు కామారెడ్డి బిజెపి అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జ్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి శనివారము తాను రూపొందించిన మేనిఫెస్టో ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కామారెడ్డి, దోమకొండ, మాచారెడ్డి, పాల్వంచ, బిబిపేట్, బిక్నూర్, రాజంపేట్ మండలాలలోని దారిద్ర రేఖకు దిగువన ఉన్న 80 శాతం ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలోని ఏడు మండలాల ప్రజలు సరైన వైద్యం అందక ఎంతోమంది అప్పులు చేసి కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యానికి ఖర్చు చేస్తూ అప్పుల పాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన ఉచిత విద్య పొందలేక ఎంతోమంది విద్యకు దూరమవుతున్నారని ఇంకా చాలా మంది బీద ప్రజలు అప్పులు చేసి కార్పొరేట్ పాఠశాలలు కళాశాలలో చదివిస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక నాణ్యమైన విత్తనాలు అందుకోలేక వారు పండించిన పంటలకు సరియైన సదుపాయాలు అవకాశాలు లేక చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. నిరుద్యోగులైన యువకులు, మహిళలకు సరియైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని తన సొంత డబ్బులతో కాటిపల్లి రాజారెడ్డి జనసేన ట్రస్ట్ ఆధ్వర్యంలో కామారెడ్డి నియోజకవర్గంలోని ఏడు మండలాలకు 150 కోట్ల రూపాయలతో ప్రజలకు మంచి సేవలు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి మేనిఫెస్టోను సిద్ధం చేసి రూపకల్పన చేసి అమలు చేస్తానని తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో ఉచిత వైద్యం కొరకు ఒక ఆసుపత్రిని నిర్మించి ఆ ఆసుపత్రిలో 24 గంటలు వైద్యులు సిబ్బందిని నియమించి అన్ని సౌకర్యాలు అందులో అందేటట్లు చూస్తానని తెలిపారు. అలాగే ఏడు మండలాలలో ఏ ఆసుపత్రిలో అయితే ప్రజలకు అక్కడ అందని వైద్యము జిల్లా కేంద్రంలో 18 కోట్ల రూపాయలతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కార్పొరేట్ దీటుగా నిర్మించి అన్ని వైద్య పరీక్షలతో పాటు అన్ని ఆరోగ్య పరీక్షలు అందుబాటులో ఉంచుతామని ఇకనుండి కామారెడ్డి నియోజకవర్గంలో వైద్యం కొరకు దూర ప్రాంతాలైన హైదరాబాద్ వెళ్లకుండా తదితర కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న ఆసుపత్రిలో అన్ని రకాల రోగాలకు వైద్యులను, సిబ్బందిని ఏర్పాటు చేసి 24 గంటలు పని చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ప్రతి మండల కేంద్రంలో ఉచిత విద్య అందించడానికి నాణ్యమైన విద్యను ఉచితంగా అందిస్తామని తెలిపారు. విద్యతోపాటు మంచి క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడానికి క్రీడా ప్రాంగణాన్ని కూడా ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని క్రీడా నైపుణ్యం కలవారిని ఇటు మండలం, జిల్లా కేంద్రం, రాష్ట్రంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే విధంగా వారికి అన్ని సౌకర్యాలను సదుపాయాలను ఏర్పాటు చేసి వారి కొరకు కృషి చేస్తామన్నారు. మహిళలు, నిరుద్యోగులకు, యువకులకు, ప్రతి మండల కేంద్రంలో ఉచిత నిరుద్యోగ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటర్, ఇంజనీరింగ్, మెకానికల్, తదితర వాటిలో నైపుణ్యం గల వారిచే ఉచిత శిక్షణను ఏర్పాటు చేసి వారికి ఉపాధి అవకాశాలను కల్పించి వారిని కూడా ఆర్థికంగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఇక దేశానికి వెన్నెముక అయిన రైతుల కొరకు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు ప్రతి మండల కేంద్రంలో రైతు భూసార పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేసి భూసార పరీక్ష కేంద్రము, విత్తనాల ఏర్పాటు, రైతు సేవ కేంద్రం, మండల కేంద్రంలోని రైతు పండించిన పంటలను అమ్ముకోవడానికి తగిన ఏర్పాట్లను చేస్తామని తెలిపారు. రైతులు ఆరుగాలం పండించిన పంటలు అకస్మాత్తుగా వర్షాలతో నష్టపోతున్నారని రోడ్లపై ధాన్యాన్ని ఆరబోసి రాత్రింబగళ్లు కావలి ఉంటూ ఎంతోమంది ప్రమాదాలకు గురవుతున్నారని భావించి ప్రతి గ్రామంలో రైతు కల్లాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి కొరకై 63 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్టు తెలిపారు.





## రుద్రంగిలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

**బోనామెత్తిన మహిళా భక్తులు - అన్నదాన కార్యక్రమాలు**

ప్రతినిధి రుద్రంగి (వాయిస్ టుడే): రుద్రంగి మండల కేంద్రంలో భక్తులు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు శుక్రవారం మహాలక్ష్మి ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గాదేవికి, యువ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారికి పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొని బోనాలు సమర్పించారు .శనివారం మాహా లక్ష్మి యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ఎంపీపీ స్వరూప రాణి మహేష్ ,జెడ్పిటిసి గట్ల మినయ్య , సర్పంచ్ ప్రబలత మనోహర్, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం మరియు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శరన్నవరాత్రుల సందర్భంగా అత్యంత భక్తి శ్రద్ధలతో దుర్గామాతను పూజిస్తామని, అందరిని సుఖశాంత సంతోషాలతో చల్లగా చూడాలని ఆ దుర్గామాతను వేడుకున్నామన్నారు.

## అవినీతి అక్రమాలకు పాలుపడిన ముధోల్ పంచాయితీ కార్యదర్శి సస్పెండ్....



ముధోల్ , వాయిస్ టుడే. అక్టోబర్ 21: వివరాల్లోకి వెళితే నిర్మల్ జిల్లా ముధోల్ తాలూకా కేంద్రంలోని బైపాస్ రోడ్ గోదాం పక్కన గత 70-80 ఏళ్ళుగా ఉన్న హిందూ స్మశాన వాటిక స్థలాన్ని లంచం తీసుకొని ప్రైవేట్ వ్యక్తులకి ధారాదత్తం చేస్తూ రెగ్యులర్ చేసిన ముధోల్ పంచాయతీ సెక్రటరీ పవన్ కుమార్ పై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముధోల్ పంచాయితీ సెక్రటరీ చేసిన అవినీతి అక్రమాలపై గత వారం రోజుల క్రితం నుండి అధికారులు విచారణచేస్తూ ఈరోజు నిర్మల్ జిల్లా.కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ .పంచాయతీ సెక్రటరీ పవన్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.పంచాయితీ సెక్రటరీ పవన్ కుమార్ గత మూడేళ్ళుగా విధులలో నిర్లక్ష్యం వహిస్తూ, ఇనాం భూములు , ప్రభుత్వ ఖాళీ స్థలాలని ఇంటి నెంబర్ లు జారీచేస్తూ, గత మూడేళ్ళుగా ప్రభుత్వ%శీ% ప్రతిష్టత్మకంగా చేపట్టిన కార్యక్రమాలు అయినటువంటి హరితహారం, పల్లెప్రగతి, ప్రకృతివనాలు, గృహాలక్ష్మి సర్వే, స్వర్ణోత్సవాలు, గాంధీ జయంతి, వివిధ అవతరణ దినోత్సవాలు, డబల్ బెడ్ రూమ్ గ్రామ సభ, ఉపాధి హామీ నిర్వహణ ఇలా ప్రతి కార్యక్రమం విషయం లో పూర్తి నిర్లక్ష్యం గా వహించారు.

ఉన్నతిధికారుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా విధుల్లో కి రాకుండా గైర్హాజరు అవ్వడం లాంటి చట్టవిరుద్ధమైన పనులు చేశారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ పాలక వర్గానికి తెలియకుండా అక్రమంగా NOC పత్రాలు జారీ చేయడం, ఇనాం పట్టా కానీ భూములకు రెగులర్ చేయడం, ముధోల్ చుట్టుపక్కల మొత్తం ప్రభుత్వ స్థలాలు ,బజారు, పాత బస్టాండు, కొత్త బస్టాండు లవద్దప్రైవేట్ వ్యక్తుల ఆక్రమణలను సహకరిస్తున్న సెక్రటరీ గురించి ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళింది. గ్రామ పంచాయతీ ప్రాథమిక విధులైన నీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పటు, జాతర, గ్రామ ఉత్సవాల నిర్వహణ గురించి ఏమాత్రం పట్టించుకోకుండా కేవలం మామూళ్ల వసూలు పనులు మాత్రమే చేస్తూ ఇన్నేళ్లు తప్పించుకున్నారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు సరిగ్గా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించారు. పాలకవర్గముకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు రాకుండానేమామూళ్లు తీసుకొని ఇంటివద్దనుంచే పెర్మిషన్స్ ఇచ్చేసారు. ముధోల్ లో ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నోఅవినీతి అక్రమాలకు పాల్పడుతున్న సెక్రటరీ ని జిల్లా కలెక్టర్ గ్రామ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అతనిని సస్పెండ్ చేసారు.



## ఎన్నికల ఫిర్యాదుల పై తక్షణమే స్పందించాలి

**నిరంతరం అప్రమత్తంగా ఉండాలి**

**సమీకృత జిల్లా ఫిర్యాదుల కేంద్రం, ఎంసిఎంసీ, మీడియా సెంటర్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్,ఎస్పీ**

వాయిస్ టుడే ప్రతినిధి రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 21: నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల ఫిర్యాదుల పై వేగంగా స్పందించాలనీ కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం గ్రౌండ్ ఫ్లోర్ లో 24 గంటలు పని చేసే సమీకృత జిల్లా ఫిర్యాదుల కేంద్రం, ఎంసిఎంసీ , మీడియా సెంటర్ ల ను కలెక్టర్ అనురాగ్ జయంతి,జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు తనిఖీ చేసి సి - విజిల్, కంట్రోల్ రూం, 1950 , సోషల్ మీడియా ఫిర్యాదుల నమోదును పరిశీలించారు. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు నిస్వాక్షపాతంగా స్వేచ్ఛాయుత ప్రశాంత వాతావరణంలో జరగడంలో సమీకృత జిల్లా ఫిర్యాదుల కేంద్రం, ఎంసిఎంసీ , మీడియా సెంటర్ కీలక పాత్ర అన్నారు.ఎన్నికలలలో ఓటర్లను ప్రలోభ పెడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చినా.. మీడియా లో ఫేక్ న్యూస్ ప్రసారమైన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సమీకృత జిల్లా ఫిర్యాదుల కేంద్రం బాధ్యులు మహమ్మద్ రఫీ, మీడియా సెంటర్ బాధ్యులు , డి పి ఆర్ ఓ మామిండ్ల దశరథం , తదితరులు పాల్గొన్నారు.

